# పవన్‌పై ఎవరు కుట్ర చేస్తారు?

## పర్సంటేజీ విధానం అమలు చేయాలి
## సింగిల్ థియేటర్లను కాపాడుకోవాలి
## మీడియాతో ఆర్.నారాయణ మూర్తి

'హరిహరవీరమల్లు'ను దృష్టిలో పెట్టుకొని థియేటర్ల బంద్ జరుగుతున్నదని, అందులో కుట్ర ఉందని.. కుట్రదారులెవరో తెలుసుకోవాలని స్వయంగా పవన్‌కల్యాణ్ ఆఫీస్ నుంచి ప్రకటన రావడం ఏ మాత్రం సమంజసంగా లేదని అన్నారు దర్శకనిర్మాత, పీపుల్స్‌స్టార్ ఆర్.నారాయణ మూర్తి. సినీరంగంలో గొప్ప స్థానం ఉండి, డిప్యూటీ సీఎంగా ఎదిగిన పవన్‌కల్యాణ్‌పై ఎవరు కుట్రపన్నుతారని ప్రశ్నించారు. పర్సంటేజీ విధానం అమలును పక్కన పెట్టి, ఇదంతా 'హరిహరవీరమల్లు'కు నష్టం చేసేందుకు కుట్ర అంటూ తెరపైకి తీసుకురావడం చాలా దుర్మార్గమన్నారు. శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఇండస్ట్రీ సమస్యలపై మాట్లాడారు. బంద్ గురించి ఫిల్మ్ ఛాంబర్, ప్రొడ్యూసర్ కౌన్సిల్‌లో ఎప్పుడూ చర్చ జరగలేదని, ఒకవేళ బంద్ తలపెడితే మూడు వారాల ముందుగా నిర్మాతలకు తెలియజేయాలనే రూల్ ఉందని ఆర్.నారాయణమూర్తి గుర్తు చేశారు. 'హరిహర వీరమల్లు' పేరు ఎత్తకుండా ఓ పెద్దన్న తరహాలో ఇండస్ట్రీని చర్చలకు పిలిస్తే పవన్‌కల్యాణ్‌పై మరింత గౌరవం పెరిగేది. పర్సంటేజీ సిస్టమ్ లేకపోవడం వల్ల సగటు నిర్మాత బాగా నష్టపోతున్నాడు. మాల్స్ వచ్చిన తర్వాత సింగిల్ థియేటర్ ఉనికి లేకుండా పోతున్నది. తెలంగాణలో 500 సింగిల్ థియేటర్‌లు ఉండగా నేడు అవి 200లకు చేరాయి. మాల్స్‌లో సగటు ప్రేక్షకులు సినిమా చూసే పరిస్థితులు లేవు' అని ఆర్. నారాయణ మూర్తి తెలిపారు.



### 25 ఏళ్లుగా పోరాటం

25 ఏళ్లుగా థియేటర్లలో పర్సంటేజీ విధానం అమలు కోసం పోరాడుతున్నా ఎలాంటి ఫలితం లభించలేదని ఆర్.నారాయణమూర్తి ఆవేదన చెందారు. 'మల్టీప్లెక్స్‌ల మాదిరిగానే సింగిల్ థియేటర్లకు కూడా పర్సంటేజీ విధానం ఉండాలి. దీని కోసం గత 25 ఏళ్లుగా పోరాటం చేస్తున్నాం. ఛాంబర్ ముందు ఆందోళనలు కూడా చేశాం. ఎందరో ఛాంబర్ ప్రెసిడెంట్‌లకు విజ్ఞప్తి చేసినా సమస్య పరిష్కారం కాలేదు. ఈ దేశంలో సగటు ప్రేక్షకుడికి వినోదం సినిమానే. ఈ పాలసీల వల్ల సగటు మనిషి సినిమాకు దూరమవుతున్నాడు. సినిమా హాల్ అంటే ఓ దేవాలయం. అది బాగుండాలి. ఇవాళ ఎన్నో థియేటర్లు కల్యాణమండపాలుగా మారిపోతున్నాయి. కార్పొరేట్ సంస్థలు థియేటర్ల వ్యవస్థను ఆక్టోపస్‌లా ఆక్రమిస్తున్నాయి. కాబట్టి సింగిల్ థియేటర్ వ్యవస్థను బ్రతికించుకోవాలి. వెంటనే పర్సంటేజీ విధానం అమలు చేయాలి. లేకపోతే ఓటీటీలో సినిమాలు చూస్తారు.' అని ఆర్.నారాయణమూర్తి అన్నారు. భారీ బడ్జెట్ చిత్రాలు తీయడం పరిశ్రమకు గర్వకారణమేనని, అయితే ఆ సినిమాలకు రేట్లు పెంచడం ఎందుకని నారాయణమూర్తి ప్రశ్నించారు.

'హాలీవుడ్‌లో ఎన్నో వందల కోట్లతో సినిమాలు తీస్తున్నారు. షోలే, మొఘల్ ఏ అజాం, లవకుశ వంటి సినిమాలు ఎన్నో వ్యయప్రయాసలతో నిర్మాణం జరుపుకొని అపూర్వ విజయాలను సొంతం చేసుకున్నాయి. 'లవకుశ'ను ఐదేళ్లు తీశారు. ఆ సినిమాకు టికెట్ ధరలు పెంచమని అడగలేదు. సినిమా బాగుంటే జనాలు వస్తారు. టికెట్ పెంచడం వల్ల అభిమానులే వారి హీరోల సినిమాలను చూడలేకపోతున్నారు' అని ఆర్.నారాయణ మూర్తి పేర్కొన్నారు.



అగ్ర నటుడు నాగార్జున, అమల దంపతులు శనివారం సీఎం రేవంత్ రెడ్డిని ఆయన స్వగృహంలో కలిశారు. తమ కుమారుడు అఖిల్ వివాహ ఆహ్వాన పత్రికను సీఎంకు వారు అందజేశారు. గత ఏడాది నవంబర్‌లో జైనబ్ రవ్జీతో అఖిల్ నిశ్చితార్థం జరిగిన విషయం తెలిసిందే. త్వరలో ఈ జంట పెళ్లిపీటలెక్కబోతున్నారు. అయితే వివాహ తేదీని ఇంకా వెల్లడించలేదు.




ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల సినీరంగంలో 25 ఏళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవిని కలుసుకున్నారాయన. '25 ఇయర్స్ ఆఫ్ శేఖర్ కమ్ముల' 'సెలబ్రేటింగ్ ది సోల్ ఆఫ్ స్టోరీ టెల్లింగ్' పోస్టర్‌ని చిరంజీవి ఆవిష్కరించారు. ఈ విషయాన్ని శేఖర్ కమ్ముల సోషల్‌మీడియా ద్వారా తెలియజేస్తూ ఫొటోలను పంచుకున్నారు.



# సినిమాకు వెరైటీ టైటిల్?

వెరైటీ టైటిల్స్ రవితేజకు కొత్తేం కాదు. ఇట్లు శ్రావణి సుబ్రహ్మణ్యం, ఇడియట్, అమ్మానాన్న ఓ తమిళ మ్మాయి, నేనింతే, ఔను వాళ్లిద్దరూ ఇష్టపడ్డారు.. ఇలా చెప్పుకుంటూ పోతే వెరైటీ టైటిల్స్ చాలానే తగుల్తాయి. త్వరలో మరో విభిన్నమైన టైటిల్‌తో మాస్‌మహారాజా రాబోతున్నారని ఫిల్మ్‌నగర్ వర్గాల టాక్. ప్రస్తుతం రచయిత భాను భోగవరపు దర్శకత్వంలో ఆయన 'మాస్ జాతర' సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. జూలైలో సినిమాను విడుదల చేసేందుకు నిర్మాతలు సూర్యదేవర నాగ వంశీ, సాయిసౌజన్యలు సన్నాహాలు చేస్తున్నారు. ఇదిలావుంటే ఈ సినిమా తర్వాత కిశోర్ తిరుమల దర్శకత్వంలో రవితేజ ఓ సినిమా చేయనున్నారు. ఈ సినిమాకు 'అనార్కలి' అనే ఇంట్రెస్టింగ్ టైటిల్‌ని ఖరారు చేశారట. ఈ పేరు వినగానే సినిమాపై ఆడియన్స్‌కి ఆసక్తి మొదలైంది. చెరుకూరి సుధాకర్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో కేతిక శర్మ కథానాయిక.



# ఆడితే వెరీగుడ్.. ఆడకపోతే బ్యాడ్‌లక్!

అందం, మానసిక పరిపూర్ణత అలంకారాలుగా చేసుకున్న నటి రష్మిక మందన్నా. బాలీవుడ్‌లో ఆమె నటించిన, యానిమల్, చావా చిత్రాలు భారీ విజయాలను నమోదు చేయగా, సల్మాన్‌ఖాన్‌తో ఆమె నటించిన 'సికిందర్' సినిమా మాత్రం చేదు అనుభవాన్నే మిగిల్చింది. ఈ విషయంపై ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆమె స్పందించింది. 'జీవితంలో ఏదీ శాశ్వతం కాదు. ఈ రోజు ఉన్నట్టు రేపు ఉండదు. అదే జీవితం. మనం ఏ పరిస్థితుల్లో ఉన్నా కుటుంబ సభ్యుల నుంచి, స్నేహితుల నుంచి మద్దతు లభిస్తున్నదీ అంటే.. ఇక మనకు మించిన అదృష్టవంతులు వేరొకరు లేరని అర్థం. నేను చేసే ఏ సినిమా విషయంలోనూ ఎక్స్‌పెక్టేషన్స్ పెట్టుకోను. అది బాగా ఆడితే వెరీగుడ్. ఆడపోతే బ్యాడ్ లక్..అంతే.' అని చెప్పుకొచ్చింది రష్మిక. ఇంకా చెబుతూ 'జీవితంలో కఠినమైన పాఠాలుండవ్. అన్నీ విలువైన పాఠాలే ఉంటాయి. మనం వాటిని తీసుకునే విధానంలోనే తేడా ఉంటుంది. ఈ సందర్భంగా అందరికీ నేనిచ్చే సలహా ఒక్కటే. ఇతరులను సంతోషపెట్టాలనే భారాన్ని మాత్రం మోయకండి. మీ ఆనందంపై దృష్టి పెట్టండి. అప్పుడు మీ కుటుంబాలు కూడా బావుంటాయి.' అని పేర్కొన్నది రష్మిక మందన్నా.

# తమిళ నాడులో తగ్గనున్న టికెట్ రేట్లు



తమిళనాడులో సినిమా టికెట్ రేట్లు తగ్గనున్నాయి. అక్కడి లోకల్‌బాడీ ఎంటర్‌టైన్‌మెంట్ ట్యాక్స్‌ను తగ్గించడమే ఇందుక్కారణం. ప్రస్తుతం 8.6 శాతం ఉన్న వినోదపు పన్నును 4 శాతానికి తగ్గిస్తూ తమిళనాడు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ఈ నిర్ణయం వెంటనే అమలులోకి వస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఈ నెల 5న విడుదలకాబోతున్న కమల్‌హాసన్ 'థగ్‌లైఫ్' చిత్రానికి టికెట్ రేట్లు తగ్గబోతున్నాయి. ఎంటర్‌టైన్‌మెంట్ ట్యాక్స్‌ను తగ్గించడం గొప్ప నిర్ణయమని, సామాన్యులకు సినిమా మరింత చేరువవుతుందని ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ సౌత్ ఇండియా తమిళనాడు ఓ ప్రకటనలో తమిళనాడు సీఎం స్టాలిన్‌కు కృతజ్ఞతలు తెలియజేసింది. కొద్ది రోజుల క్రితమే ఎంటర్‌టైన్‌మెంట్ ట్యాక్స్‌ను తగ్గించాలని కమల్‌హాసన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కోవిడ్ తర్వాత ఇండస్ట్రీ ఆర్థికంగా సతమతమవుతున్న దృష్ట్యా పరిశ్రమను ఆదుకోవాలని కమల్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం వినోదపు పన్నును తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం థియేటర్లలో ఆక్యుపెన్సీని పెంచడానికి దోహదపడుతుందని, తద్వారా పరిశ్రమకు మేలు జరుగుతుందని ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



# మా అంచనాలు నిజమయ్యాయి

'భైరవం' చిత్రానికి అన్ని కేంద్రాల్లో అద్భుతమైన ఆదరణ లభిస్తున్నది. ఇది థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే సినిమా. మా ముగ్గురి పాత్రల్లోని కొత్తదనం ప్రేక్షకుల్ని మెప్పిస్తున్నది' అన్నారు చిత్ర హీరోలు బెల్లంకొండ సాయిశ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్. ఈ ముగ్గురు ప్రధాన పాత్రల్లో విజయ్ కనకమేడల దర్శకత్వంలో రూపొందిన 'భైరవం' చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. కె.కె.రాధామోహన్ నిర్మాత. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో బెల్లంకొండ సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ 'ఇది నా కెరీర్‌లోనే మోస్ట్ మెమరబుల్ మూవీ. పర్‌ఫార్మెన్స్‌కు స్కోప్ ఉన్న ఇలాంటి పాత్ర రావడం అదృష్టంగా భావిస్తున్నా' అన్నారు. తొమ్మిదేళ్ల తర్వాత సినిమా చేశానని, ప్రేక్షకులు గొప్పగా ఆదరించారని మంచు మనోజ్ ఆనందం వ్యక్తం చేశారు. ఇది టీం అందరి విజయమని నారా రోహిత్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ విజయం చూస్తుంటే తదుపరి చిత్రాన్ని ఐదుగురు హీరోలతో చేయాలనే ఉత్సాహం కలుగుతున్నదని, 'భైరవం' తమ అంచనాలన్నింటిని నిజం చేసిందని నిర్మాత కె.కె.రాధామోహన్ పేర్కొన్నారు.



## మరో ప్రేమకథకు శ్రీకారం

'బేబీ'ఫేం సాయి రాజేష్ కథను అందిస్తూ, మరో నిర్మాత ఎస్‌కేఎన్‌తో కలిసి ఓ చిత్రాన్ని నిర్మించనున్నారు. రవి నంబూరి దర్శకత్వం వహించనున్న ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్, గ్లింప్స్ రేపు విడుదల చేయనున్నట్టు మేకర్స్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆసక్తికరమైన ఓ పోస్టర్‌ని కూడా విడుదల చేశారు. ఓ జంట బీచ్‌లో నడుచుకుంటూ వెళ్తుండటం, అక్కడే ఉన్న ఓ బండి మీద దిగ్గర్శకుడు కె.బాలచందర్ ఫొటో ఉండటం ఈ సినిమా కథపై ఆసక్తిని రేకెత్తిస్తున్నది. పోస్టర్‌లో కనిపిస్తున్న ఈ జంట ఎవరనే క్యూరియాసిటీ కూడా ఈ పోస్టర్ చూస్తే కలుగుతున్నది. త్వరలో షూటింగ్ మొదలుకానున్న ఈ సినిమాకు మణిశర్మ సంగీత దర్శకుడు.

## రాజకీయ ధర్మచక్రం




'ధర్మచక్రం' పేరుతో ఓ రాజకీయ చిత్రం రూపొందుతున్నది. SIFFAA సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి వెంకటరమణ పసుపులేటి దర్శకుడు. ఏపీ రాజకీయాల నేపథ్యంలో ఈ సినిమా రూపొందుతున్నదని మేకర్స్ తెలిపారు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ 'నోటు రుచి మరిగిన వారికి పదవులిస్తే ఓటు విలువ తగ్గుతుందనే సందేశంతో ఈ సినిమా రూపొందిస్తున్నాం. ఎన్టీఆర్ జన్మదినం సందర్భంగా ఈ సినిమా ఆడియోను విడుదల చేయడం ఆనందంగా ఉంది' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: రాజకిరణ్.

# ఫొటో వెనక మతలబు

తెలుగు ఇండస్ట్రీలో అనతికాలంలోనే అగ్ర నాయికల్లో ఒకరిగా గుర్తింపును తెచ్చుకుంది అచ్చ తెలుగందం శ్రీలీల. జయాపజయాలతో సంబంధం లేకుండా భారీ చిత్రాల్లో అవకాశాలను సొంతం చేసుకుంటూ కెరీర్‌లో దూసుకుపోతున్నది. తాజాగా ఈ భామ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో షేర్ చేసిన ఓ ఫొటో అందరిలో ఆసక్తిని పెంచింది. ఆమె కుటుంబ సభ్యులు పసుపు, కుంకుమ రాసి ఆశీర్వదిస్తున్న ఫొటోలను పంచుకున్న శ్రీలీల..వాటికి 'బిగ్‌డే' 'కమింగ్ సూన్' అనే క్యాప్షన్‌లను జత చేసింది. ఈ ఫొటోలను చూసిన నెటిజన్లు .. శ్రీలీల నిశ్చితార్థ వేడుకను జరుపుకుందని కామెంట్లు చేస్తున్నారు. మరికొందరేమో ఏదైనా వాణిజ్య ప్రకటన కోసం శ్రీలీల ఈ ఫొటోలను షేర్ చేసిందని, ఎంగేజ్‌మెంట్ వంటి ప్రత్యేక సందర్భాన్ని ఆమె ఎందుకు గోప్యంగా ఉంచుతుందని అభిప్రాయపడుతున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం నిశ్చితార్థ వార్తల్లో ఏమాత్రం నిజం లేదని తెలిసింది. శ్రీలీల కుటుంబ సభ్యులు ఇంట్లో జరిగే ప్రతీ వేడుకను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తారని, ఈ ఫొటో కూడా అలాంటి వేడుక సందర్భంగా తీసిందేనని అంటున్నారు. ఏదిఏమైనా ఒక్క ఫొటో అభిమానుల్లో అనేక చర్చలకు దారితీసింది.



# మేఘాలు చెప్పిన ప్రేమకథ



నరేష్ అగస్త్య నటిస్తున్న మ్యూజికల్ రొమాంటిక్ డ్రామా 'మేఘాలు చెప్పిన ప్రేమకథ'. విపిన్ దర్శకత్వంలో ఉమాదేవి కోట నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణ దశలో ఉంది. ప్రమోషన్లో భాగంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ సినిమా టీజర్‌ని మేకర్స్ లాంచ్ చేశారు. ఓ సంగీతకారుడి చుట్టూ ఈ కథ తిరుగుతుందని టీజర్ చెబుతున్నది. అతను ఓ ఆల్బమ్ తయారు చేసేందుకు.. స్ఫూర్తికోసం ఓ ప్రశాంతమైన పర్వత ప్రాంతానికి వెళతాడు. అక్కడ అతనికి ఓ అమ్మాయి తారసపడుతుంది. ఈ ఇద్దరి ప్రయాణమే సినిమా కథ అని టీజర్ చూస్తే తెలుస్తున్నది. ప్రయోగాత్మక సంగీత భరిత ప్రేమకథ ఇదని, ఓ క్లీన్ ఎంటర్టైనర్ చూసిన అనుభూతిని ఈ సినిమా ఇస్తుందని దర్శకుడు చెప్పారు. కె.విశ్వనాథ్‌గారి తరహాలో కళాత్మక చిత్రాలు చేయాలని తలంపుతో ఈ సంస్థ స్థాపించానని, కనీసం కళలు కనెక్ట్ అయ్యేలా ఒక అయిదు సినిమాలైనా నిర్మించాలనేది నా ఆశయమని నిర్మాత ఉమాదేవి తెలిపారు. రబియా ఖాతూన్, రాధిక శరత్‌కుమార్, తనికెళ్ల భరణి, వెంకటేష్ కాకుమాను, విద్యుల్లేఖ, సుమన్, ఆమని, తులసి తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: మోహనకృష్ణ, సంగీతం: జస్టిస్ ప్రభాకరన్, కళ: తోట తరణి, నిర్మాణం: సునేత్ర ఎంటర్టైన్మెంట్ ప్రై.లిమిటెడ్.

# కవితాత్మక కథాంశంతో స్కై

మురళీకృష్ణంరాజు, శృతిశెట్టి జంటగా నటించిన పొయెటిక్ లవ్‌స్టోరీ 'స్కై'. నాగిరెడ్డి గుంటక, శ్రీలక్ష్మి గుంటక, మురళీకృష్ణంరాజులతో కలిసి పృథ్వీ పెరిచెర్ల స్వీయ దర్శకత్వంలో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. త్వరలో సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా 'జర్నీ ఆఫ్ ఎమోషనల్ స్కై' పేరిట ఓ టీజర్‌ని శనివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మేకర్స్ విడుదల చేశారు. 'మేమంతా ప్యాషన్‌తో చేసిన సినిమా ఇది. అనుకున్న బడ్జెట్‌లో సినిమాను పూర్తి చేయగలిగాం. ఆడియన్స్‌కి సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వగలమన్న నమ్మకం ఉంది.' అని దర్శక, నిర్మాత పృథ్వీ పెరిచెర్ల అన్నారు. ఇంకా హీరో, నిర్మాత మురళీకృష్ణంరాజు, డీవోపీ రసూల్ ఎల్లోర్ కూడా మాట్లాడారు. ఆనంద్ భారతి, రాకేశ్ మాస్టార్, ఎంఎస్, కేఎల్‌కే మణి తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం శివప్రసాద్, నిర్మాణం: వాలోర్ ఎంటర్టైన్మెంట్ స్టూడియోస్.



